వాటర్ 'హోల్డింగ్' రావట్లేదా?

-వర్షాల వేళ రోడ్లపైనే నిలుస్తున్న నీరు
-నిర్వహణ లోపంతో నిరుపయోగంగా భూగర్భ సంపులు
-నీరు తరలించే పైపుల్లో భారీగా మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలు
-పలుచోట్ల పనిచేయని మోటార్లు...
సాంకేతిక లోపాలు
-అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

హైదరాబాద్,జూన్ 24,ప్రభాతవార్త: వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమంటూ కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ ఇప్పుడు నిరుపయోగంగా మారాయి. సచివాలయం ముందు, రాజ్ భవన్ రోడ్, కేపీసీ జంక్షన్‌తో పాటు నగరంలోని 12 కీలక ముంపు ప్రాంతాల్లో ఏర్పాటు చేసినా, నిర్వహణ లేక మూలనపడ్డాయి. 10 లక్షల నుంచి 40 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే సామర్థం ఉన్న ఈ సంపులు, వర్షాకాలంలో నగరాన్ని ముంపు నుంచి కాపాడాల్సింది పోయి ఇప్పుడు సమస్యకు కారణమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలో ప్రతి వర్షానికి రోడ్లు చెరువులను తలపించడం, ట్రాఫిక్ స్తంభించడం, కాలనీలు నీట మునగడం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో బల్దియా అధికారులు గతేడాది ప్రత్యేక ప్రణాళిక చేపట్టారు. ఇందులో భాగంగా సచివాలయం ముందు, రాజ్ భవన్ రోడ్, కేపీసీ జంక్షన్‌తో పాటు మరో 9 ముంపు ప్రాంతాల్లో మొత్తం 12 వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ నిర్మించారు. ఒక్కో సంపు 10 లక్షల నుంచి 40 లక్షల లీటర్ల వరకు నీటిని నిల్వ చేసే సామర్థంతో ఏర్పాటు చేశారు. వర్షపు నీటిని తాత్కాలికంగా నిల్వ చేసి, అనంతరం డ్రైనేజీ వ్యవస్థలోకి పంపించాలన్నదే దీని లక్ష్యం. అయితే కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ వ్యవస్థల నిర్వహణ పూర్తిగా గాలికొదిలేసినట్లు కనిపిస్తోంది. సంపుల్లో నిల్వయ్యే నీటిని బయటకు పంపించే హై కెపాసిటీ మోటార్లు చాలా చోట్ల పనిచేయడం లేదు. కొన్నిచోట్ల మోటార్లు పూర్తిగా దెబ్బతినగా, మరికొన్ని చోట్ల నిర్వహణ లేక సాంకేతిక లోపాలు తలెత్తాయి. వర్షాకాలం ప్రారంభమయ్యే ముందు నిర్వహణ చేపట్టాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో మొత్తం వ్యవస్థ నిర్వీర్యమైంది.

పైపుల్లో చెత్తా చెదారం..

సంపులకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్ల పరిస్థితి కూడా దారుణంగానే ఉంది. సంపుల్లోకి చేరిన నీటిని డ్రైనేజీలకు తరలించే పైపుల్లో భారీగా మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోయాయి. మరోవైపు సంపులపై ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ పూర్తిగా మట్టితో మూసుకుపోయాయి. శుభ్రపరిచే పనులు చేపట్టకపోవడంతో వర్షపు నీరు సంపుల్లోకి వెళ్లకుండానే రోడ్ల పైనే నిలిచిపోయింది. రెండ్రోజుల క్రితం కురిసిన వర్షానికి ఈ నిరక్ష్యం స్పష్టంగా బయటపడింది. వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ ఏర్పాటు చేసిన ప్రాంతాల్లోనే గంటల తరబడి నీరు నిలిచిపోయింది. సచివాలయం పరిసరాలు, రాజ్ భవన్ రోడ్, కేపీసీ జంక్షన్‌తో పాటు పలు కీలక రహదారులు చెరువులను తలపించాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా, ట్రాఫిక్ కూడా స్తంభించింది. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టు కేవలం ప్రారంభోత్సవాలకే పరిమితమైందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రతి ఏడాది వర్షాకాలానికి ముందు సంపుల డీసిల్టింగ్, మోటార్ల మరమ్మతులు, పైప్‌లైన్ క్లీనింగ్, గ్రిల్స్ శుభ్రపరిచే పనులు చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఈసారి అలాంటి చర్యలు కనిపించలేదు. వర్షాలు మొదలైన తర్వాతే అధికారులు హడావుడిగా స్పందించడం వల్ల సమస్యలు మరింత పెరుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. 10 లక్షల నుంచి 40 లక్షల లీటర్ల సామర్థం ఉన్న వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ సక్రమంగా పనిచేస్తే ముంపు సమస్య గణనీయంగా తగ్గేదని, ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాటిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ నిర్వహణ లేక నిరుపయోగంగా మారడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. వర్షాలు ఇంకా మొదటిదశలోనే ఉండటంతో, ముందున్న భారీ వర్షాలను జీహెచ్ఎంసీ ఎలా ఎదుర్కొంటా యన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

హైదరాబాద్ వార్త

పకడ్బందీగా వర్షాకాల ముందస్తు చర్యలు

-నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లలో డీసిల్టింగ్ పనులు వేగవంతం : ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త వర్షాకాలంలో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు ఎంఎంసి (మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్) కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మౌలాలి రోడ్, నేరెడ్‌మెట్ ఎక్స్‌రోడ్, సూర్యనగర్, దీన్‌దయాళ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లలో క్రమం తప్పకుండా పూడిక తొలగింపు పనులు చేపట్టాలని, నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో రహదారులపై నీరు నిల్వ కాకుండా అన్ని చర్యలు తీసుకొని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం ఈస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతంలో నీరు నిలిచే ప్రాంతాలు, ఓపెన్ నాలాలు మరియు స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ ప్రాంత భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వర్షపు నీరు సమీప నాలాల ద్వారా సక్రమంగా మళ్లి నివాస ప్రాంతాల్లోకి ప్రవేశించకుండా ఉండే విధానాన్ని సమీక్షించారు. డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే పలు ప్రాంతాల్లో ఓపెన్ నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోవడం వల్ల వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్నట్లు గుర్తించారు. వెంటనే చెత్తను తొలగించి, నాలాలు మరియు డ్రెయిన్లలో నిరంతర డీసిల్టింగ్ పనులు చేపట్టాలని సూచించారు. వర్షపు నీరు సాఫీగా పారేలా డ్రైనేజీ మార్గాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మారుతినగర్ ప్రాంతంలో నిర్వహించిన పరిశీలనలో రహదారి పక్కన అక్రమంగా పారవేసిన నిర్మాణ వ్యర్థాలను గుర్తించిన కమిషనర్, వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఇందుకు బాధ్యులైన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం తో పాటు భవిష్యత్తులో ఇటువంటి అక్రమ డంపింగ్ జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు.

వర్షాకాలంలో ఎలాంటి నీటి నిల్వలు, వరద ముప్పు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

ఓపెన్‌నాల పనులు, వర్షపు నీటి పారుదల వ్యవస్థను పరిశీలిస్తున్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి

-అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షించాలి
-జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా ఆదేశం

హైదరాబాద్, జూన్ 23,ప్రభాతవార్త: పేద, నీరుపేదలకు సొంత ఇంటి కల సకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా అమలు చేస్తున్న రెండు పడక గదుల (2బిహెచ్‌కే) నిర్మాణ పనులను వేగవంతం చే యాలని జిల్లా కలెక్టర్ ప్రియాక అలా అన్నారు. మంగళవారం జిల్లాలోని ఆసీఫ్‌నగర్‌లో భోజ గుట్ట వద్ద రెండుపడక గదలు ఇండ్ల నిర్మాణ పను లను హౌసింగ్ పిడి అకోక్ చక్రవర్తి, ఆర్‌డిఓ రామకృష్ణ, జిహెచ్‌యంసి ఈఈ నర్సయ్యలతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఇండ్ల నిర్మాణ ప్రదేశాన్ని సంబంధిత అధికారులతో కలిసి కలియదిరిగారు. అలాగే ఇండ్లకు సంబంధించిన మ్యాప్‌ను పరి శీలించి, పనులు పురోగతిపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల అలస్యంపై కారణా లు కాంట్రాక్టరు కలెక్టర్‌కు వివరించారు. నిర్మా ణంలో ఏమైన సమస్యలు ఉత్పన్నమైతే వాటిని అదికమించి వేగవంతం చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. మంజూరు అయిన ఇండ్ల నిర్మాణాన్ని నిర్ధే శించిన వ్యవధిలోపూ పూర్తిచేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. భో జగుట్టలో 1824 రెండుపడక గదులు మంజూరు కాగా వీటిని 13 ఎకరాల్లో 73 బ్లాకులలో నిర్మా ణం చేపట్టగా వీటిలో ప్రస్తుతం 192 పూర్తి కావ చ్చాయని మిగతా ఇండ్ల నిర్మాణ పనులు వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. అలాగే నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు యంత్రాంగం నిరంతరం క్షేత్రస్థా యిలో పర్యవేక్షణ చేయాలని ఈ సందర్భంగా ఆమె ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, జిహెచ్‌యంసి డిఈ కలీమ్, హౌసింగ్ ఎ ఈలు మనోజ్,మానస, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

బోజగుట్టవద్ద ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

కన్నుల పండువగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి రథోత్సవం

సైఫాబాద్, జూన్ 23 ప్రభాతవార్త: హిమాయత్‌నగరంలోని టిటిడి బాలాజీ భవన్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాయలం 21 వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4వ రోజు మంగళవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి రథోత్సవం కార్యక్రమం పురవీధుల్లో అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. మహిళల కోలాటం, భక్తిగీతాలు, భక్తుల గోవింద నామాలు, గోవిందా నినాదాలతో పురవీధులు మారుమ్రోగాయి. ఈ రథోత్సవంలో రథాన్ని లాగడానికి భక్తులు పోటి పడ్డారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న మహిళలు స్వామివారికి మంగళహారతులు పట్టారు. స్వామివారికి కొబ్బరికాయలు కొట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు ఈ రథోత్సవంలో పాల్గొన్నారు. అంతకు ముందు స్వామి వారికి సుప్రభాతం, సర్వదర్శనం, సహస్రదీపాలంకరణ, ఏకాంతసేవ తదితర పూజా కార్యక్రమాలు దేవాలయంలో యధావిధిగా జరిగాయి. సాయంత్రం అశ్వ వాహనంపై శ్రీవారి ఊరేగింపు వీధుల్లో వైభవంగా జరిగింది. ఈ ఊరేగింపులో కూడా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి అన్న ప్రసాదాల వితరణ జరిగింది. బాలాజీభవన్ భక్తుల సొసైటి ప్రతినిధులు 20 లక్షల వ్యయంతో సుమారు 12 సంవత్సరాల క్రితం నిర్మించి స్వామివారికి కానుకగా అందించినదే ఈ రథం. భక్తులకు టిటిడి ఉద్యోగులు, శ్రీవారి సేవకులతోపాటు బాలాజీభవన్ భక్తుల సొసైటి ప్రతినిధులు శ్రీనివాస్ (వాసు మెడికల్ హాల్), వేణు మనోహర్ తదితరులు భక్తులకు సేవలు అందించారు. బుధవారంతో ఈ బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని పురవీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం

హిమాయత్‌సాగర్‌కు పెరుగుతున్న వరద నీరు

హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త : క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా హిమాయత్‌సాగర్ జలాశయంలో నీటి మట్టం మంగళవారం తెల్లవారుజాము నుంచి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుత పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తున్న అధికారులు, అవసరమైతే పరిస్థితులకు అనుగుణంగా జలాశయం నుంచి వరద నీటిని విడుదల చేసే అవకాశం ఉందని జలమండలి అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖలు, విపత్తు నిర్వహణ విభాగాలు, స్థానిక సంస్థలు, అలాగే జలాశయాల దిగువ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి విజ్ఞప్తి చేసింది. జలాశయాల గేట్ల నిర్వహణ, నీటి విడుదల (డిశ్చార్జ్) లేదా ఇతర అత్యవసర చర్యలకు సంబంధించి ఏవైనా నిర్ణయాలు తీసుకున్న వెంటనే అధికారిక ప్రకటనల ద్వారా ప్రజలకు, మీడియాకు సమాచారం అందజేయబడుతుందని జలమండలి స్పష్టం చేసింది.

జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సూచనలు..

ఈ సందర్భంగా జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ, జంట జలాశయాల పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సంబంధిత విభాగాలు పరస్పర సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. జలాశయాల దిగువ ప్రాంతాల్లో నివసించే ప్రజలు పరిస్థితిని గమనిస్తూ అధికారుల సూచనలను పాటించాలని, అవసరమైతే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

మిస్టరీ వీడిన బౌరంపేట్ చోరీ కేసు

-40 తులాల బంగారం స్వాధీనం

పేట్ బషీరాబాద్‌లోని డీసీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

పేట్ బషీరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త

బౌరంపేట్‌లోని త్రిపుర ల్యాండ్‌మార్క్2లో జరిగిన గృహ దొంగతనం కేసును దుండిగల్ పోలీసులు కేవలం 12 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 40 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గడ్డపోతారంలోని ఓ ఫార్మా కంపెనీలో ఫిర్యాదిదారు, నిందితుడు సహోద్యోగులుగా పనిచేస్తున్నారు. ఫిర్యాదిదారు వద్ద పెద్ద మొత్తంలో బంగారం ఉందని తెలుసుకున్న నిందితుడు చింతల లక్ష్మీనారాయణ దానిని దొంగిలించేందుకు పథకం రచించాడు. ఈ నెల 22న మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఫిర్యాదిదారు హ్యాండ్‌బ్యాగ్‌లోని ఇంటి తాళాలు తీసుకుని, బైక్‌పై బౌరంపేట్‌లోని ఆమె ఇంటికి వెళ్లి తాళాలతో తలుపు తెరిచి అల్మారాలో ఉన్న 40 తులాల బంగారు ఆభరణాలను దొంగిలించాడు. అనంతరం కంపెనీకి తిరిగి వెళ్లి తాళాలను మళ్లీ హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, సాంకేతిక ఆధారాలు, నిందితుడి కదలికల ఆధారంగా అతడిని 12 గంటల్లోనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు మియాపూర్‌కు చెందిన చింతల లక్ష్మీనారాయణ (36)గా గుర్తించారు. ఈ కేసు ఛేదనలో మేడ్చల్ డివిజన్ సహాయ పోలీసు కమిషనర్ శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో దుండిగల్ ఇన్‌స్పెక్టర్ ఎం. బాలరెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ దాలి నాయుడు, ఎస్ఐలు శంకర్, ఎం. రామ్మోహన్‌రెడ్డి, క్రైమ్ టీమ్ సిబ్బంది వెంకటయ్య, రజినీకాంత్, బాలరెడ్డి, తిరుపతి, లచ్చయ్య పాల్గొన్నారు.

ఫర్నిచర్ తయారీ కార్ఖానా గోదాంలో అగ్నిప్రమాదం..

కార్వాన్,జూన్23 (ప్రభాతవార్త) గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వింటేజ్ ఫంక్షన్ హాల్ సమీపంలో గల ఫర్నిచర్ తయారీ కార్ఖానాలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. భారీగా ఎగసి పడిన మంటలు పక్కనే ఉన్న మరో రెండు ఫర్నిచర్ యూనిట్లకు వ్యాపించి అగ్నికి ఆహుతి అయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు,అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని నాలుగు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనపై గుడిమల్కాపూర్ పోలీస్ లు కేసు నమోదు చేసుకొని,ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

హబీబ్ నగర్ పిఎస్ పరిధిలో రౌడీషీటర్ హల్‌చల్..

కార్వాన్,జూన్23 (ప్రభాతవార్త) హబీబ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన రౌడీషీటర్ అస్లాం మద్యం మత్తులో అగాపురా లోని సెంట్రల్ బేకరీ సమీపంలోని ఓ హోటల్లోకి తాగిన మైకంలో ప్రవేశించి హోటల్లోని వస్తువులను ధ్వంసం చేసివి ధ్వంసానికి పాల్పడ్డాడు. హోటల్ యాజమాన్యం హబీబ్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు వెంటనే స్పందించి వీరంగం సృష్టిస్తున్న రౌడీ షీటర్ అస్లాంనుఅదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి దృశ్యాలను పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

-వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి
-జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్

హైదరాబాద్, జూన్ 23,ప్రభాతవార్త: ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండి అవి ప్రభలకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అధజకారులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం నాంపల్లి క్లస్టర్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, బస్తీ దవాఖాన, ఆర్‌బిఎస్‌కే చెందిన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, గర్భిణీల సంరక్షణ, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ,ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే, ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా టిబి అధికారి డా చల్లా దేవి, క్లస్టర్ ఆఫీసర్ డా. మురళీధర్, జిల్లా మాస్ మీడియా అధికారి జక్కుల రాములు, డిపిఓ సంతోష్, సబ్ యూనిట్ ఆఫీసర్ ఆంజనేయులు పాల్గొని వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్

వ్యవసాయ వర్సిటీలో రైతు ఆదాయ భద్రతపై మేధో మధన సదస్సు

అత్తాపూర్ జూన్ 23,ప్రభాతవార్త : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు ఆదాయ భద్రతమార్గాలు, ప్రత్యామ్నాయ విధానాలు అన్న అంశం పై మంగళవారం వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఆధ్వర్యంలో ఒవిస్తృత స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల ఆదాయం పెంపొందించేందుకు అవసరం అయిన అన్ని చర్యలు తీసుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సిద్ధంగా ఉన్నారని అల్దాస్ జానయ్య అన్నారు. అందుకు అవసరం అయిన సాంకేతిక అంశాల ని సూచించే నోడల్ ఏజెన్సీ బాధ్యత ని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అప్పగించారన్నారు. అందుకే భాగస్వాముల అభిప్రాయాలు స్వీకరించేందుకు ఈ సదస్సుని నిర్వహిస్తున్నట్లు జానయ్య తెలిపారు. ప్రకృతి వనరులని పరిరక్షిస్తూనే రైతుల ఆదాయం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విధానాల తో పాటు అనేక ఇతర కారణాల వల్ల వరి విస్తీర్ణం బాగా పెరిగిందన్నారు. అవసరాలకి మించి పెరిగిన వరి ఉత్పత్తి కొనుగోలు, నిల్వల వల్ల సవాళ్ళు ఎదురవు తున్నాయని జానయ్య అభిప్రాయపడ్డారు. అదే సమయం లో ప్రభుత్వమే పూర్తి పంటల కొనుగోలు బాధ్యత తీసుకోవడం వల్ల మార్కెట్ లో ఔత్సాహిక వ్యాపారస్తులు మరియు ఎగుమతి దారులు మార్కెట్ లో భాగస్వాములయ్యే అవకాశాలు తగ్గాయని అదే విధంగా మొత్తం ఉత్పత్తి ప్రభుత్వమే కొనుగోలు చేయడం వల్ల మార్కెట్ లో సరఫరా తగ్గడం వల్ల వినియోగదారులకి బియ్యం ధరలు పెరుగుతున్నాయని జానయ్య అభిప్రాయపడ్డారు. రైతులకు,వినియోగ దారు లకి ఆశించిన స్థాయిలో ప్రయోజనం కలగడం లేదని అన్నారు. ఈ అభి ప్రాయం తో రైతు సంఘాల నాయకులు ఏకీభవించారు. ప్రస్తుత విధానాల్లో మార్పు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. అందుకే ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇచ్చి రైతులు పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు,నూనె గింజలు పండించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. అదే విధంగా వరి సహా అన్ని పంటలకి సంబందించి విలువ జోడింపు, ఉప ఉత్పత్తుల తయారీ పైన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయి కొనుగోలు దారులా కాకుండా ఒక పక్కా నియంత్రణ వ్యవస్థ ని ఏర్పాటు చేసి.. కొనుగోళ్ళు సాఫీలా జరిగేలా చూడాలని జానయ్య సూచించారు. అప్పుడే రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులకు ఆదాయ భద్రత కలిపించే మార్గాలు పై ఇంకా విస్తృత స్థాయి లో చర్చలు, సంప్రదింపులు జరిపి ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదిక సమర్పిస్తామని అల్దాస్ జానయ్య తెలిపారు. వ్యవసాయ రంగ నిపుణులు అరిబండి ప్రసాద్ రావు, రైతు సంఘాల ప్రతినిధులు సారంపల్లి మల్లారెడ్డి, జయపాల్ రెడ్డి, సాగర్, నరేంద్ర రెడ్డి, రైతులు లింగయ్య, చంద్రశేఖర్, లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

విహరింపజేసిన అర్ధనారీశ్వరం నృత్యోత్సవం

రవీంద్రభారతి, జూన్ 23 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మూడు రోజులపాటు విశేష స్పందనతో వైభవోపేతంగా సాగుతున్న అర్ధనారీశ్వరం జాతీయ నృత్యోత్సవం రెండవరోజు మంగళవారం రాత్రి శివపార్వతుల ఆనంద తాండవం హాజరైన అశేష ప్రేక్షకులను ఆధ్యాత్మికలోకంలో విహరింపజేసి దివ్య దైవత్వాన్ని పెంపొందింపజేసింది. ప్రధానంగా ముంబయి కళాకారులు పవిత్ర భట్, అపర్ణశాస్త్రిలు ఏక ద్వయం ప్రదర్శించి అబ్బురపరిచారు. ఆదిశంకరాచార్య అర్ధనారీశ్వర స్తోత్రం, నటరాజస్వామి కుంచితపాదం అంశాన్ని కళ్లకుకట్టి ఔరా అనిపించారు. తదుపరి బెంగళూరుకు చెందిన భరతనాట్య కళాకారుడు డా. వసంత్‌కిరణ్ ప్రదర్శించిన సభాపతి స్పందన రేకెత్తించింది. గోపాలకృష్ణభారతి స్వరకల్పన చేసిన పదాన్ని వసంత్‌కిరణ్ స్వయంగా ఆలపించి ఆకట్టుకోగా తమిళ చరిత్రకారుడు నందనార్ నటరాజస్వామిలో కలసిపోయి నయనార్‌గా ఎదిగిన క్రమాన్ని అద్భుతంగా ఆవిష్కరించి ప్రశంసలందుకున్నారు. చివరగా తెలంగాణ హైదరాబాద్ నగరానికి చెందిన ప్రముఖ నృత్యకళాకారిణి, నాట్యాచారిణి వైష్ణవి సాయినాథ్ తన బృందంతో చేసిన నృత్యాంశాలు సభికులను తన్మయుల్ని చేశాయి. తెలంగాణ రాష్ట్ర జైళ్లు సర్వీసుల డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా పద్మశ్రీ అవార్డు గ్రహీత డా. ఆనందశంకర్ జయంత్, పద్మశ్రీ ఉమామహేశ్వరి, డా. కళాకృష్ణలు ముఖ్య అతిథులుగా పాల్గొని అర్ధనారీశ్వరం జాతీయ నృత్యోత్సవాలను అభినందిస్తూ ప్రదర్శనలిచ్చిన కళాకారులను అభినందించారు. అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల నృత్యోత్సవ ప్రాముఖ్యతను వివరించి 3వరోజు బుధవారం ప్రదర్శన వివరాలను వెల్లడించారు.

ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు పోలీసుల సహకారం

పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించిన ఈఆర్ఓ, డిఎంసీ

జూబ్లీహిల్స్, జూన్ 23, ప్రభాతవార్తః ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి(ఈఆర్ఓ), జీహెచ్ ఎంసీ సర్కిల్38 డిప్యూటీ కమిషనర్ ఎ. సురేష్ మంగళవారం ఉన్నతస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మధురానగర్, పంజాగుట్ట, సనత్‌నగర్, బోరబండ, గోల్కొండ, టోలిచౌకి పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. ఎస్ఐఆర్2026 ప్రక్రియలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, క్షేత్రస్థాయి కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేందుకు ఎన్నికల అధికారులతో సమన్వయంగా పనిచేయాలని ఈఆర్ఓ సూచించారు. విధుల్లో ఉన్న ఎన్నికల సిబ్బందిని అడ్డుకోవడం, దురుసుగా ప్రవర్తించడం లేదా అంతరాయం కలిగించే వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం, భారతీయ న్యాయ సంహిత నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తి భద్రత, సహకారం అందిస్తామని పోలీసు అధికారులు ఈ సందర్భంగా ఎన్నికల అధికారులకు హామీనిచ్చారు.

ముస్లింలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

అభివాదం చేస్తున్న సయ్యద్ అజీజ్‌పాషా, ముక్తార్ హుస్సేన్, ఎం.ఎ.సిద్ధిఖీ తదితరులు

సైఫాబాద్, జూన్ 23 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ముస్లిం మైనార్టిలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆల్ ఇండియా ముస్లిం మైనార్టి ఆర్గనైజేషన్ డిమాండ్ చేసింది. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరాహార దీక్షలు చేపడతామని ఆర్గనైజేషన్ హెచ్చరించింది. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదరి , రాజ్యసభ మాజీ సభ్యుడు సయ్యద్ అజీజ్‌పాషా ఆర్గనైజేషన్ ఛైర్మన్ సయ్యద్ ముక్తర్ హుస్సేన్, ప్రతినిధి ఎం.ఎ. సిద్ధిఖీ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు, బిసిలకు సబ్ ప్లాన్‌లు ఉన్నప్పుడు మైనార్టిలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి, తగినన్ని నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. రంగనాథ్ మిశ్రా కమిషన్, సచార్ కమిటీలు ముస్లిం మైనార్టి స్థితిగతులపై నివేదికలు సమర్పించడం జరిగిందని ఇంతవరకు ఆ నివేదికలను ప్రభుత్వాలు అమలు చేయలేదని ఆరోపించారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌లు కల్పించడం జరిగిందని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 6 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాలలో వెనుకబడ్డ ముస్లింలు రాష్ట్రంలో 12 శాతం జనాభ ఉందని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టడానికి ఎంతో కృషి చేసిందని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

జెడ్పీహెచ్ఎస్‌లో మాదకద్రవ్యాల పట్ల అవగాహన

మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొంపల్లి, జూన్ 23, ప్రభాతవార్త

జగత్‌గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో యల్లమ్మబండలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆరోగ్యంపై వాటి ప్రభావం, చదువు, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాల గురించి పోలీసులు వివరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు వ్యాసరచన పోటీని కూడా నిర్వహించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలని, సమాజంలో అవగాహన పెంచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని తెలిపారు. అదేవిధంగా దత్తాత్రేయ కాలనీలో స్థానిక యువత, విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు వాలీబాల్ టోర్నమెంట్‌ను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రీడలు, విద్య, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

ఇందిర మహిళా శక్తి చీరెల పంపిణీ

చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్.

జూబ్లీహిల్స్, జూన్ 23, ప్రభాతవార్తః

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ గౌతమ్‌నగర్‌లో ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి ఇంటికి చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనంతరం మహిళల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఎల్‌వోలకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాల్లో పార్టీ సభ్యులు పాల్గొని ఓటర్ల ధృవీకరణ ప్రక్రియను పరిశీలించాలని, ఎక్కడైనా లోపాలు కనిపిస్తే తమ దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్, గుంటి నగేష్ సాగర్, ఆకుల రాజు, అబ్దుల్ గని, పోతుల మల్లేష్, ఓర్సు శ్రీను, ఆర్. ఎల్లయ్య, సంపంగి కిరణ్, గద్దల ప్రభాకర్, నక్క రాము, సత్యనారాయణ, రాములు, భవాని సింగ్, మహిళా నాయకురాళ్లు పద్మ, దానమ్మ, చంద్రమ్మ, సుగుణ, మంజులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఎరుకుల జాతికి ఎస్టీ రిర్వేషన్‌లు కల్పించిందుకు స్వర్ణోత్సవ వేడుకలు

సైఫాబాద్, జూన్ 23 ప్రభాతవార్త: ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 1976లో ఎరుకల, యానాది, లంబాడీ తెగలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించి అర్ధశతాబ్దం పూర్తి అవుతున్న సందర్భంగా 'రిజర్వేషన్‌ల స్వర్ణోత్సవ వేడుకలు' ఈ నెల 25వ తేదీ నుంచి తెలంగాణ వ్యాప్తంగా 'ఇందిరమ్మ ఆశ్వీర్వాద బస్ యాత్ర' పేరిట నిర్వహిస్తున్నామని తెలంగాణ ఏకలవ్య ఎరుకల సంఘం తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ, కె. కృష్ణ తదితరులు ఈ బస్‌యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ 25వ తేదీ ఉదయం నక్లెస్‌రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తామని, తదనంతరం గాంధీభవన్‌లో బస్‌యాత్రకు సిఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి మినాక్షి నటరాజన్, పిపిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొని బస్‌యాత్రకు జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. బస్‌యాత్ర రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కొనసాగి, ఎస్టీలను చైతన్యవంతం చేస్తుందని, సెప్టెంబరు 18వ తేదీన 'చలో హైదరాబాద్' పేరిట ఎల్‌బిస్టేడియంలో భారీ బహిరంగ సభ కొనసాగుతుందని, ఈ సభలో పలువురు ప్రముఖులు ప్రసంగిస్తారని వారు వివరించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు ఏరుకల, యానాది, లంబాడీ జాతులకు విజ్ఞప్తి చేశారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బుడ్డ సత్యనారాయణ, కృష్ణ తదితరులు

ముగిసిన హైదరాబాద్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నీ

-ఫైనల్లో హరాహోరీగా తపపడిన జట్లు

హైదరాబాద్, జూన్ 23,ప్రభాతవార్త: హైదరాబాద్ లిటిల్ స్టార్స్ సాకర్ అకాడమీ నిర్వహించిన హైదరాబాద్ సూపర్ లీగ్ 2026 ముగింపు వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి. యువ క్రీడాకారుల అద్భుతమైన ప్రతిభ, జట్టుకృషి, నిజమైన ఫుట్‌బాల్ స్ఫూర్తిని చాటుతూ ఈ టోర్నీలోని ప్రధాన విభాగాల ఫైనల్స్ అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో ముగిశాయి. సబ్‌జూనియర్ సీజన్ 4 ఫైనల్ మ్యాచ్‌లో ఎఫ్‌కే స్టార్స్ జట్లు ప్రతిష్టాత్మకమైన ఛాంపియన్‌షిప్ టైటిల్ కోసం హోరాహోరీగా తలపడ్డాయి. ఈ ఉత్కంఠభరితమైన పోరులో ఎఫ్‌కే స్టార్స్ జట్టు 20 తేడాతో ఘన విజయాన్ని సాధించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈవిజయంలో అయాన్ ఖాన్ అద్భుతమైన ఆటతీరుతో రెండు గోల్స్ చేసి జట్టును ముందుండి నడిపించాడు. ఇక డిఫెన్స్ విభాగంలో అహ్మద్ తన అసాధారణమైన ప్రదర్శనతో ప్రతి దాడిని సమర్థవంతంగా అడ్డుకున్నాడు. తన జట్టుకు ఒక్క గోల్ కూడా కాకుండా క్లీన్ షీట్ కాపాడి ట్రోఫీని అందించినందుకు గాను అహ్మద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు. జూనియర్ సీజన్ 6 ఫైనల్ మ్యాచ్‌లో కూడా ట్రోఫీ కోసం హైదరాబాదీ ఫ్లేమ్స్ ఐఈఏ జట్ల మధ్య అంతే హోరాహోరీ పోరు సాగింది. ఈ మ్యాచ్‌లో ఫ్లేమ్స్ జట్టు మైదానంలో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ 20 తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. విశ్వతేజ, సమయ్ ల అద్భుతమైన ఆటతీరు ఈ విజయానికి బాటలు వేసింది. సమయ్ మొదటి గోల్‌కు అత్యంత కీలకమైన అసిస్ట్ అందించి మ్యాచ్‌ను తమ వైపు తిప్పగా.. విశ్వతేజ నిర్ణయాత్మకమైన రెండవ గోల్ చేసి విజయాన్ని ఖాయం చేశాడు. ఈ అద్భుత ప్రదర్శనకు గాను విశ్వతేజ "మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్" గౌరవాన్ని దక్కించుకున్నాడు.

పోటీల్లో గెలుపొందిన జట్లు

ఫీజు రీయంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి : శివ నాగేశ్వర్‌రావుగౌడ్

హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త: పెండింగ్ ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఆర్‌పిఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రఘుపతి ముద్రపీటర్ నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంకు ముఖ్య అతిథిగా హాజరై శివనాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి, ఆర్‌పిఐ(ఏ) జాతీయ అధ్యక్షులు రాందాస్ అథావాలే ఆదేశాల మేరకు తెలంగాణ విద్యార్థుల సమస్యల పరిష్కారానికై పోరాడతామని వెల్లడించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ దశలవారీగా రద్దు చేయటానిక కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అందులో భాగంగానే జీవో నెంబర్ 7ను రద్దు చేసి, జీవో 8,9 లను తీసుకువచ్చి, బీసీలకు ఉరితాడుగా బిగించిందని ఆరోపించారు. తక్షణమే పాత పద్ధతిలోనే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, లేనిపక్షం సీఎం, మంత్రుల పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు. తక్షనమే ఆర్ఆర్ యాక్ట్‌తో పాటు జీవో నెంబర్ 8,9లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావే శంలో రాష్ట్ర కార్యదర్శి దాచారం శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ రాచమల్ల పోతురాజు, పార్టీ నాయకులు సుద్దాల అశోక్, కొండా జానయ్యగౌడ్, చంద్రశేఖర్, హరీష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శివ నాగేశ్వరరావు గౌడ్

ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ఉస్మానియాలో అరుదైన శస్త్ర చికిత్స...

అఫ్జల్‌గంజ్, జూన్ 23 ప్రభాతవార్త: ప్రమాదవశాత్తు భవన కార్మికుడి భుజంలోకి ఇనుప సీకు చొచ్చుకపోవడంతో ప్రాణ ప్రాయస్థితిలో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి వచ్చిన భవన నిర్మాణ కార్మికుడికి ఉస్మానియా జనరల్ సర్జరీ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. మరోసారి ఉస్మానియా వైద్యులు తమకు సాటిలేరని నిరూపించారు. మంగళవారం ఉస్మానియా ఆసుపత్రిసూపరిండెంటెంట్ చాంబర్‌లో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ సిద్దిపేట్‌రమేష్, కృష్ణారెడ్డిలతో కలిసి ఉస్మానియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ ప్రొఫెసర్, డాక్టర్ రాకేష్ సాహయ్ మాట్లాడుతూ మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చైత్రం రాత్(27)బతుకు దెరువు కోసం శంషాబాద్ ప్రాంతానికి వచ్చారు. భవన నిర్మాణ కార్మికుడి పని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఈనెల 16వ తేదిన పని చేస్తున్న ప్రాంతంలో ప్రమాదవశాత్తుగా ఇనుప సీకు భుజంలోకి చొచ్చుకు పోయింది. తొటి కార్మికులు ప్రాణ ప్రాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న చైత్రంను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. జనరల్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ గోపాల్‌రావు పర్యవేక్షణలో ప్రొఫెసర్ డాక్టర్ సిద్దిపేట్ రమేష్ తన వైద్య బృందం చైత్రంకు వివిధ వైద్యపరీక్షలను నిర్వహించారు. అనంతరం భుజానికి అరుదైన శస్త్రచికిత్స జరిపి ప్రాణాలను నిలిపారు. ప్రైవేట్ ఆసుపత్రిలో అయితే మూడు నుంచి 4లక్షల రూపాయలు అవుతుందన్నారు. మరోసారి తమకు సాటిలేరని ఉస్మానియా వైద్యులు నిరూపించుకున్నారు. వైద్యులు శ్రేయాన్, లక్ష్మి నారాయణ, నర్సింగ్ సిబ్బంది తమ సహాయ సహకారాలను అందించినట్లు సిద్దిపేట్ రమేష్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్.ఎం.ఓ డాక్టర్ శ్రీమన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొలుకుంటున్న ఉస్మానియా ఆసుపత్రి వైద్య బృందం

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఇన్స్‌పెక్టర్ సైదులు

,ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకం,నివారణపై అవగాహన కల్పిస్తున్న సీఐ సైదులు.

బేగంపేట జూన్ 23,ప్రభాతవార్త

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బేగంపేట ఇన్స్‌పెక్టర్ సైదులు పిలుపు నిచ్చారు. మల్కాజ్ గిరి కమీషనర్ బి.సుమతి,డీసీపీ శ్రీధర్‌ల సూచనల మేరకు బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సుమారు 300మంది విధ్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటాం. శ్రద్దతో విధ్యను అభ్యసించి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకుంటామంటూ ఇన్స్‌పెక్టర్ ఆధ్వర్యంలో విధ్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాన్ని, తల్లి దండ్రుల ఆశలను నాశనం చేస్తున్న మహమ్మారి మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వాడకానికి దూరంగా ఉండాలన్నారు. చెడు సహవాసాల వల్ల మాదక ద్రవ్యాల వాడకం అలవాటు చేసుకుంటున్న యువత వారి బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారని అన్నారు. వారితో పాటు వారి కుటుంబసభ్యులు, బంధువుల జీవితాలపై కూడా ప్రభావాన్ని చూపేలా చేసుకుంటున్నారని, అలాంటి ఫ్రెండ్స్‌కు దూరంగా ఉంటూ తల్లి దండ్రుల ఆశయాలను దృష్టిలో ఉంచుకొని విధ్యార్థులు నిర్ణయించుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మత్తుకు అలవాటు పడిన వారు క్రమంగా దొంగతనాలకు పాల్పడుతున్నారని, హత్యలు చేస్తున్నారని, అలాంటి చెడు వైపు అడుగులు వేయకుండా మంచి నిర్ణయంతో చక్కటి లక్ష్యాన్ని సాధించి తల్లి దండ్రులు, సమాజం గర్వపడే స్థాయిలో నిలవాలని సైదులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో విధ్యార్థినులు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్రీధర్, షఫీలతో పాటు కళాశాల అధ్యాపక బృందం, విధ్యార్థులు పాల్గొన్నారు.

విద్యాసామాజిక సేవ రంగాలలో విశేష కృషి

-బాగ్‌లింగంపల్లి అంబెడ్కర్ విద్యాసంస్థకు తమిళనాడు గవర్నర్ ప్రశంస

చిక్కడపల్లి జూన్ 23 (ప్రభాతవార్త) : సామాజిక సేవ, విద్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న సమాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ రంగాల విభాగంలో బాగ్ లింగంపల్లి డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి సతీమణి డాక్టర్ సరోజ వివేక్ కు అరుదైన గౌరవడం దక్కింది. ఈ మేరకు మంగళవారం బాగ్ లింగంపల్లి విద్యాసంస్థల ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ చేతులమీదుగా సామజిక సేవ, పరిరక్షణ రంగాలలో విశేషంగా కృషి చేసినందుకు గాను అవార్డు దక్కిందన్నారు. కార్యక్రమంలో విద్యావేత్తలు, సామాజిక కార్య కర్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. అవార్డు అందుకున్న డాక్టర్ సరోజ వివేక్ ను పలువురు ప్రముఖులు అభినందించారు.

మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి

చార్మినార్, జూన్ 23 ప్రభాతవార్త : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యన్నతి కోసం అన్ని విధాల కృషి చేస్తున్నదని టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటి చైర్మన్, బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ కమిటి ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ తెలిపారు. బహదూర్‌పుర నియోజకవర్గంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయనఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ఆదేశాలు మేరకు మహిళల కోసం ఇందిరమ్మ రాజ్యం కనిపించేలా చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు మీర్ మహ్మద్ అలీషాన్, కార్యవర్గ సభ్యులు క్రిష్ణవేణి, జిహెచ్ఎంసి అధికారిణి కవిత పాల్గొన్నారు.

త్యాగరాయ గానసభలో ముగిసిన త్రీ ఎం కళోత్సవాలు

చిక్కడపల్లి జూన్ 23 (ప్రభాతవార్త) : మిమిక్రీ, మ్యాజిక్, మైమ్ కళలకు వేదికగా నిలిచిన త్రీ ఎం సప్తాహ్మ ఉత్సవాలు చాలా సంవత్సరాల తర్వాత చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఘనంగా నిర్వహించడంతో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ నెల 15 నుంచి 21 వరకు వారం రోజుల పాటు సాగిన ఉత్సవాల్లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని కళాకారులను ప్రోత్సహించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి, తెలంగాణ రాష్ట్ర మాజీ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి ప్రోద్బలంతో, త్యాగరాయ గానసభ సహకారంతో ఈ కార్యక్రమాలు జరిగాయి. 1991లో మాయా వినోదం పేరుతో మిమిక్రీ, మ్యాజిక్, మైమ్ కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి రమణాచారి త్రీ ఎం ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఆ కార్యక్రమాల నిర్వహణలో డాక్టర్ . నేరెళ్ల వేణుమాధవ్, డాక్టర్ బి.వి. పట్టాభిరామ్ కీలక పాత్ర పోషించారు. ఈసారి జరిగిన సప్తాహంలో సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి. శ్రీనివాసరావు, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ వేణుగోపాలచారి, తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ మంత్రి బాబూమోహన్, హైదరాబాద్ జిల్లా జడ్జి కె. మురళీ మోహన్, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మాజీ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో వి. హనుమంతరావు కళాకారులను సత్కరించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతిరోజూ మిమిక్రీ, మ్యాజిక్, మైమ్ ప్రదర్శనలను ఏర్పాటు చేయడంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మైమ్ కళాకారుడు జెన్నీకి 82వ సహస్ర చంద్ర దర్శన సత్కారం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణలో చొక్కాపు వెంకటరమణ, కళారత్న మల్లం రమేష్, డా. జి.వి.ఎన్. రాజు, మెజీషియన్ రామడుగు వసంత్, మిమిక్రీ భవిరి శివ సమన్వయ బాధ్యతలు నిర్వర్తించారు. త్రీ ఎం కుటుంబాలకు చెందిన మైమ్ కళాధర్, భావరాజు ప్రశాంత్, సుధాహరికిషన్ తదితరులు సహకరించారు. పలువురు సినీ, టీవీ కళాకారులు పాల్గొనగా, కొత్త ప్రతిభలకు కూడా వేదిక లభించింది.

నిజమైన ఓటరుకు న్యాయం జరిగేలా బిఎల్ఎలు చూడాలి

-ఎంపి కిరణ్ కుమార్ రెడ్డి
- సమన్వయంతో ముందుకు వెళ్లాలి
: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

అత్తాపూర్ జూన్ 23,ప్రభాతవార్త : సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపు జరగకుండా బూత్ లెవల్ ఎజెంట్స్ అప్రమత్తంగా ఉండి నిజమైన ఓటరుకు న్యాయం జరిగేలా చూడాలని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌లు పేర్కొన్నారు. మంగళవారం దుర్గ కన్వెన్షన్‌లో టిపిసిసి ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై బిఎల్ఎలకు అవగాహన-శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరై మాట్లాడారు...ఎస్ఐఆర్‌లో ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా తమ పార్టీ శ్రేణులు, బిఎల్ఎలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. బెంగాల్, బిహార్ ఎన్నికల మాదిరిగా మన దగ్గర కూడా దొంగ ఓట్లు చేర్చి బిజెపికి అనుకూలంగా మార్చుకునే కుట్రలు చేసే అస్కారం లేకుండా ఉందని కావున అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం విజయ డైరీ చైర్మన్ ,ట్రైనర్ గుత్త అమీత్ రెడ్డి కాంగ్రెస్ నాయకులకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. జూన్ 25 నుండి జూలై24వరకు జరిగే ఇంటింటి ఓటరు సర్వే ప్రక్రియను బిఎల్ఎలు పరిశీలించాలని తమ పార్టీకి సంబంధించిన పోలింగ్ బూత్ పరిధిలో బూత్ లెవల్ ఆఫీసర్లు బిఎల్ఓలు ప్రతి ఇంటికి వెళుతున్నారా లేదా అని నిఘా ఉంచాలన్నారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల కోసం పంపిణీ చేస్తున్న ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు సరిగ్గా నింపి, రెండో కాపిని అక్నాలెడ్జిమెంట్‌గా తీసుకునేలా బిఎల్ఎలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో జరిగిన తప్పుల వల్ల అర్హుల పేర్లు జాబితా నుండి తొలగిపోకుండా బిఎల్ఎలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ....నియోజకవర్గస్థాయిలో నాయకులు పక్షపాతంగా కలిసికట్టుగా ఎస్ఐఆర్ ప్రక్రియపై పని చేయాలన్నారు. ప్రతి బూత్‌లో బిఎల్ఎలను బలోపేతం చేసుకుంటూ ముందుకుసాగాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై అందరూ సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన నిజమైన ఓటర్‌కు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఎవైనా సమస్యలను ఎదురైత

ఆసుపత్రిలో పరదాలు కట్టడంపై పోలీసులకు ఫిర్యాదు

ఉస్మానియా ఆసుపత్రి దోబి ఘాట్ ఖాళీ స్థలంలో మొహరం కోసం వేసిన పరదాలు

అఫ్జల్‌గంజ్,జూన్ 23ప్రభాతవార్త: ఉస్మానియా ఆసుపత్రిలోని దోబీఘాట్ ఖాళీ స్థలంలో ఆసుపత్రికి సంబంధంలేని బయటి వ్యక్తులు వచ్చి పరదాలు కట్టి మొహరం పండుగ చేసుకుంటామని చెప్పడంఎంత వరకు సమంజసమని ఆసుపత్రి అధికారులు,సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.తెలంగాణ వక్ఫ్‌బోర్డు పేరిటధరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది.అసలు ప్రభుత్వ స్థలంలో పరదాలు కడుతుంటే ఆసుపత్రిలోని సెక్యూర్టీ గార్డులు ఏమి చేస్తున్నారు.మంగళవారం ఈ విషయం ఆసుపత్రి సూపరిండెంటెంట్ రాకేష్‌సహాయ్ దృష్టికి రావడంతో వెంటనే అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.పోలీసుల ద్వారా వేసిన పరదాలతో వేసిన గుడారాన్ని తొలగిస్తామన్నారు.బయటి వ్యక్తులు ఆసుపత్రి ఆవరణలో మొహరం పండుగ జరుపుకుంటామని పరదాలు కట్టే వరకు సెక్యూర్టీగార్డు ఏమి చేస్తున్నారు.అంతేకాకుండా సీనియర్ వైద్యుని కారు అద్దాలు పగిలినట్లు తెలిసింది.అసలు ఉస్మానియా ఆసుపత్రిలో సెక్యూర్టీ గార్డు అప్రమత్తంగా లేకపోవడం ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆసుపత్రి సూపరిండెంటెంట్ రాకేష్ సహాయ్ సెక్యూర్టీగార్డు ఇన్‌చార్జ్‌ను హెచ్చరించారు.పోలీసుల సహకారంతో పరదాలను తొలగిస్తామన్నారు.

బాబా బుడా అమర్‌నాథ్ యాత్ర చేసి తీరుతాం : విహెచ్‌పి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విహెచ్‌పి ప్రతినిధులు

గన్‌ఫౌండ్రి,జూన్ 23ప్రభాతవార్త: పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో ఉన్న బాబా బుడా అమర్‌నాథ్ యాత్రను చేసి తీరుతామని విశ్వహిందు పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరసింహమూర్తి, రాష్ట్రకన్వీనర్ కొండా శ్రీకాంత్‌లు తీవ్రవాదులకు సవాలు విసిరారు.ఈ మేరకు మంగళవారం కోఠి విశ్వహిందు పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆగస్టు 19న వేలాది మంది హిందు యువకులతో యాత్ర చేపట్టి బాబా బుడా అమర్‌నాథ్ యాత్ర కొనసాగించి విజయవంతంగా దర్శనం చేసుకుంటామన్నారు.బాబా బుడా అమర్‌నాథ్ యాత్రను జరగనివ్వమని తీవ్రవాదుల హెచ్చరికలనేపథ్యంలో యధా విధిగా కొనసాగుతుందన్నారు. బాబా బుడా అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనే హిందుయువకులు కోటిలోని విశ్వహిందు పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.ఈసమావేశంలోభజరంగ్‌దళ్ మహంకాళి విభాగ్ కన్వీనర్ రుద్రవరం విశాల్,భాగ్యనగర్ కన్వీనర్ అఖిల్, విభాగసహకన్వీనర్ రాజేందర్‌రెడ్డి,మహంకాళి జిల్లా కన్వీనర్ రామ్ రెడ్డి,ఉప్పల్ జిల్లా కన్వీనర్ సునీల్‌నాయక్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తాం : ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడ్‌పల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,జూన్ 23 ప్రభాతవార్త: మారేడ్‌పల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో నెలకొన్న మౌళిక సదుపాయాలు త్వరిత గతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మంగళవారం ఈస్ట్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎలక్ట్రానిక్స్ కళాశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాలల్లో నెలకొన్న సమస్యలను విద్యార్థులు,లెక్చరర్లు ఆయన దృష్టికి తెచ్చారు. కళాశాలకు ప్రహరీగోడ ఎత్తు పెంచాలని,మంచినీటి ఎద్దడి నివారణకు బోర్‌వెల్స్‌ను ఏర్పాటు చేయాలని, అంతర్గత రోడ్లకు మరమ్మత్తు చేయాలని, పాలిటెక్నిక్ కళాశాల సుందరీకరణకు ప్రత్యేక నిధులు కెటాయించాలని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలను సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కల దృష్టికి తెచ్చి సమస్యలు తక్షణమే పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సతీష్ కుమార్, ఓ.ఎస్.డి.శ్రీనివాస్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ సర్వేలో ఓటర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలి : సిఈఓ అరవింద్

సదస్సులో ప్రసంగిస్తున్న కంటోన్మెంట్ బోర్డు సిఈఓ అరవింద్ కుమార్ ద్వివేది

కంటోన్మెంట్,జూన్ 23 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించనున్న ఎస్.ఐ.ఆర్.సర్వేలో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని,ఓటర్ల జాబితాలో తమ పేర్లు గల్లంతు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కంటోన్మెంట్ బోర్డు సిఈఓ అరవింద్ కుమార్ ద్వివేది తెలిపారు. మంగళవారం ఇంపీరియల్ గార్డెన్‌లో వివిధ రాజకీయపార్టీల నేతలతో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 18 సంవత్సరాలు పూర్తైన వారి పేర్లు ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. చనిపోయిన వారి పేర్లు ఉంటే తొలగించాలన్నారు. ఒక చోట నమోదు అయితే మరో చోట ఉండడానికి వీలు లేదని సూచించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు హెల్త్ సూపరిండెంట్ ఎం.దేవేందర్ పాల్గొన్నారు.

ఎస్.ఐ.ఆర్‌సదస్సులో కాంగ్రెస్,బిజెపీల మధ్య వాగ్వివాదం . ..

కంటోన్మెంట్ సిఈఓ అధ్వర్యంలో నిర్వహించిన ఎస్.ఐ.ఆర్ సదస్సులో పలు విషయాలను సిఈఓ వెల్లడిస్తుండగా బిజెపి మహంకాలి జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఎన్.శ్రీనివాస్, బి.ఎల్.ఓ.లు అధికారి పార్టీకి చెంది కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుండగా కాంగ్రెస్ పార్టీ జోక్యం చేసుకొని ఇది రాజకీయ పార్టీ వేధిక కాదని, తమ పార్టీపై ఆరోపణలు చేయడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు,మహిళలు అభ్యంతరం తెలపడంతో సమావేశం రసాభాసగా సాధింది. ఎన్నికల కమీషన్ నియమ నిబంధనల ప్రకారమే ఎస్.ఐ.ఆర్.సర్వే కొనసాగుతుందని సిఓ సూచించారు.

కవితా సాహిత్య సౌరభవాల తెలంగాణ ప్రజాకళ మహోత్సవం

రవీంద్రభారతి, జూన్ 23 ప్రభాతవార్త : ప్రముఖుల కవితాగానంతో కవితా సాహిత్య సౌరభవాలు తెలంగాణ ప్రజాకళ మహోత్సవంలో గుభాళించాయి. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల కళామందిరం) ఆరుబయలు కళావేదికలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి నేతృత్వంలో 99 రోజులపాటు నిర్విరామంగా జరుగుతున్న సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా 83వ రోజు మడత భాస్కర్ నిర్వహణలో కవిసమ్మేళనం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇందులలో ప్రముఖ కవులు కపిల రాంకుమార్, కాసుల ప్రతాసరెడ్డి, గుడిపాటి, జగన్‌రెడ్డి, కోదాటి అరుణ, గన్నోజు ప్రసాద్, బండారు జయశ్రీ, శ్రీనివాసాచారి, వెంటక రమణాచార్యులు, నిర్మల, అంజయ్య, దుర్గయ్య, వరలక్ష్మి, నాగేందర్, పానుగంటి రాంమూర్తి, అరవింద రాముడు, శ్రీచరణ్, ప్రబోధ సుమేర్, గుడిపల్లి నిరంజన్, రవి, లావణ్య, మనోహర రావు, దాసరి నరేందర్‌రెడ్డి, మిద్దె సురేష్ తదితరులు పాల్గొని తమ అద్భుత కవితల గానంతో ఆహుతులను మైమరపించారు. నేటి తెలంగాణ ప్రజాకళ సాంస్కృతిక మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు దినకర్, జె.శ్రీనివాస్, డా. విజయ్‌కుమార్ తదితరులతో కలిసి కవిసమ్మేళనంలో తమ కవితలు వినిపించిన కవులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.కవిసమ్మేళానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు జానపద,సామాజిక చైతన్య గీతాలతో ఉత్తేజపరచగా విద్యానందచారి, శ్రీనివాసరాజులు తమ నపటిమతో రంజింపజేశారు.

డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు ప్రశంసనీయం : వడ్డేపల్లి రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 23, ప్రభాతవార్త

డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ సేవలు ప్రశంసనీయమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మంగళవారం రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయంమనీ, భారతీయ జన సంఘ్ స్థాపన ద్వారా దేశంలో జాతీయవాద ఆలోచనలకు బలమైన పునాది వేశారు అన్నారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలు, పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అని, ఆయన ఆశయాలను ముందుకు

శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

తీసుకెళ్లడమే మనందరి బాధ్యతని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి మోర్చా నాయకులు పులిగోటి శ్రీనివాస్ యాదవ్, చేదురుపల్లి శ్రీనివాస్ గౌడ్, కూకట్‌పల్లి అసెంబ్లీ ఓబీసీ మోర్చా కో కన్వీనర్ సతీష్ గౌడ్, కూకట్‌పల్లి డివిజన్ బిజెపి నాయకులు అనంత నాగరాజు, కట్టా శంకర్ రెడ్డి, ఫణీంద్ర శర్మ, గౌల ఆనంద్, ఫతేనగర్ డివిజన్ బీజేపీ నాయకులు శశికిరణ్ గౌడ్, నగేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూరారం కాలనీలో మాదకద్రవ్యాలపై అవగాహన

సీతారామయ్య నర్సింగ్ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జీడిమెట్ల, జూన్ 23, ప్రభాతవార్త

సూరారం కాలనీలోని సీతారామయ్య నర్సింగ్ కళాశాలలో మంగళవారం మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ అదనపు డీసీపీ పురుషోత్తం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన సమస్యలు, కుటుంబం, భవిష్యత్తుపై పడే తీవ్ర ప్రభావాల గురించి వివరించారు. అలాగే మాదకద్రవ్యాలు, మానసిక ప్రభావం కలిగించే పదార్థాల నియంత్రణ చట్టం (ఎన్‌డీపీఎస్ చట్టం) గురించి కూడా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, తమ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు లేదా విక్రయిస్తున్నట్టు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా విద్య, క్రమశిక్షణ, మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సూరారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ సుధీర్ కృష్ణ, సబ్ ఇన్‌స్పెక్టర్లు రాజు, కిషన్, కళాశాల కరస్పాండెంట్ ద్రాక్షయని తదితరులు పాల్గొన్నారు.

శంకర్ యాదవ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్స్ : ఎమ్మెల్యే తలసాని

అడ్డగుట్ట,జూన్ 23 ప్రభాతవార్త: వచ్చే నెల 6వ తేదీ నుంచి తలసాని శంకర్ యాదవ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్స్ అమీర్‌పేట్‌లోని మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన సందర్భంగా ఏర్పాటు చేసిన పోస్టర్‌ను మంగళవారం మారేడ్‌పల్లిలోని తలసాని క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ శేషుకుమారి, నాయకులు నర్సింహ్మ, బలరామ్, సుమిత్ సింగ్, సాయి, సచిన్ పాల్గొన్నారు.

బిజెపి కిసాన్ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షులుగా రావుల మాణిక్ ప్రభు

కార్వాన్,జూన్23 (ప్రభాతవార్త) భారతీయ జనతా పార్టీ అనుబంధ కిసాన్ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షులుగా రావుల మాణిక్ ప్రభు నియమితులైనారు.ఈ సందర్భముగా బిజెపి రాష్ట్రసీనియర్ నాయకులు కాంత అర్పన్ కుమార్,బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ప్రభు పూజారిలు మాణిక్ ప్రభును మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రైతు సంక్షేమం,పార్టీ కార్యక్రమాలు,స్థానిక సమస్యలపై ఆయన తన నాయకత్వంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

చెరువు కట్ట ధ్వంసం చేసిన రియల్‌సంస్థపై క్రిమినల్ కేసు నమోదు

దుండిగల్, జూన్ 23 ప్రభాతవార్త: వెంచర్‌లోకి దారి కోసం చెరువు కట్టను ధ్వంసం చేసిన ఓ రియల్ సంస్థపై రెవిన్యూ అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే...గండిమైసమ్మ దుండిగల్ మండలం, గాగిల్లాపూర్ పరిధిలోని కోతినార చెరువు కట్ట దిగువన ఓ రియల్ సంస్థ కాసాగ్రాండ్ సియెర్ర పేరుతో వెంచర్ వేశారు. చెరువుకట్టను రెండు చోట్ల ధ్వంసం చేసి మట్టిని నింపి వెంచర్‌లోకి వెళ్ళేందుకు రహదారిని ఏర్పాటు చేశారు. ఈవిషయమై రెవిన్యూ, ఇరిగేషన్ శాఖలకు స్థానికుల నుండి ఫిర్యాదులు అందాయి. దీంతో ఇరుశాఖల అధికారులు సదరు ప్రాంతాన్ని పరిశీలించి వెంచర్‌కు సంబంధించిన అనుమతులు వివరాలను అందజేయాలని నోటీసులు జారీ చేశారు. అనుమతులను పరిశీలించిన అధికారులు వెంచర్ నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించారు. ఉద్దేశపూర్వకంగానే చెరువు కట్ట ధ్వంసం చేసి రహదారులు వేసిన కాసాగ్రాండ్ సియెర్ర రియల్‌సంస్థపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

నిబంధనల ఉల్లంఘన ఉపేక్షించేది లేదు: తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి

చెరువు కట్ట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి (ఫైల్)

ఈమేరకు తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మాణ సంస్థలు వారి అనుమతులకు అనుగుణంగా నిబంధనలు అనుసరించి పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువు కట్ట, ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్, నాలా ప్రాంతాల సమీపంలో కొనసాగే వెంచర్ నిర్వాహకులు తమ స్థలం సరిహద్దులు దాటడం, అనుమతులు మీరి ఆక్రమణలు, అక్రమాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘన ఉపేక్షించేది లేదని ఎంతటి వారైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చాంద్రాయణగుట్ట, జూన్ 23, ప్రభాతవార్త : లాల్‌దర్వాజా వెంకట్ రావు స్మారక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల (2000-01 బ్యాచ్) రజతోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. పాఠశాల పూర్వ విద్యార్థి, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉత్సవాలలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక మాట్లాడుతూ 25 ఎళ్ళ కిందట పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగ టం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో స్వర్ణోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ప్రస్తుత, పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ తారకేశ్వర్, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, శర్మ, చంద్రకాంత్, చలమారెడ్డి, సురేష్, అర్జున్ సింగ్, పుష్పలీలా, కుసుమ, లక్ష్మీ, అమిత, విమల, రుక్మిణి, ఇంద్ర, సుగుణ దేవి, రాధా, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అంతకు ముందు స్వర్గస్తులైన టీచర్లు, విద్యార్థులకు సంతాపం ప్రకటిస్తూ మౌనం పాటించారు.

సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

హైటెక్స్‌లో మూడు రోజులపాటు ఫుడ్ ఫెయిర్ ప్రదర్శన

హైదరాబాద్ జూన్ 23 ప్రభాతవార్త

ఆహార,పానీయాల ఆవిష్కరణలు వినియోగదారు ల అభిరుచుల మేరకే జరగాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క అన్నారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మూడు రోజులపాటు జరిగే 'ఫుడ్ ఫెయిర్ 2026' ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం కోసం నిర్వహించే ఫుడ్ ఫెయిర్‌కు హాజరై ప్రారంభిస్తానని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆహార తయారీదారులు, ప్రాసెసర్లు, ఆతిథ్య రంగ నిపుణులు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, పారిశ్రామిక భాగస్వాములు ఒకచోట చేరి, ఆహార మరియు అనుబంధ రంగాలలోని సరికొత్త ఆవిష్కరణలు, సాంకేతికతలు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలలో పారిశ్రామిక వృద్ధి, వ్యవస్థాపకత, పెట్టుబడులను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. నిర్వాహకులు శ్రీకాంత్ పూనాటి, కె. కార్తీక్‌రెడ్డిలు మాట్లాడుతూ ఫుడ్ ఫెయిర్ జూలై 2, 3, 4వ తేదీన హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతుందని తెలిపారు.



హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగే ఫుడ్ ఫెయిర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

బంగారు మైసమ్మకు భక్తిప్రపత్తులతో మారు బోనం

చాంద్రాయణగుట్ట, జూన్ 23, ప్రభాతవార్త : పాతబస్తీ ఉప్పుగూడ అరుంధతికాలనీలోని శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారికి బస్తీవాసులు మంగళవారం భక్తిప్రపత్తులతో మారు బోనం సమర్పించారు. గత ఏడాది ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన నేపథ్యంలో ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పంచామృతాభిషేకం, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర రుద్రాభిషేకం, అలంకరణ, కుంభాభిషేకం, పార్వతీపరమేశ్వరుల శాంతికల్యాణం జరిగింది. ఆరుంధతికాలనీ పరిసర బస్తీల మహిళలు అమ్మవారికి బోనంలోని నైవేద్యాన్ని సమర్పించి వేపాకు నీళ్లతో సాక పెట్టారు.కుటుంబ సభ్యులతో బ్యాండు మేళాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్ళి మొక్కు చెల్లించుకున్నారు. దీంతో అరుంధతి కాలనీలో ముందే బోనాల పండుగ వచ్చినట్లయ్యింది. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, పాల్గొన్నారు.

అయోధ్యనగర్ వెల్ఫేర్ కమిటీ ఎన్నికల్లో జీల్ విజయం

పేట్ బషీరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త

అయోధ్యనగర్ వెల్ఫేర్ కమిటీ ఎన్నికల్లో జీల్ (బాబీ) 280 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు, మహిళలు కలిసి నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేశారు.విజయం అనంతరం నూతన అధ్యక్షుడు జీల్ (బాబీ), కాలనీ పెద్దలు, మహిళలతో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానందను కలిసి ఆశీర్వాదాలు తీసుకుని శుభాకాంక్షలు అందుకున్నారు. అనంతరం 132 డివిజన్ జీడిమెట్ల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంట సిద్ధిరాములను వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుంట సిద్ధిరాములు నూతన అధ్యక్షుడు జీల్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అలాగే కాలనీ ప్రజలు, పెద్దలు భారీ మెజారిటీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, నూతన అధ్యక్షుడు జీల్‌ను ఘనంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినమ్ సందర్భంగా కాటేదాన్‌లో ఆయన చిత్రపటానికి బిజెపి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: MEDIPALLY
O.S NO. 301 OF 2026

Between:
Smt. Veni Sudershan & Others ....Plaintiffs
AND
1. The Tahsildar, Medipally Mandal, Medchal-Malkajgiri Dist.
2. All concerned ....Defendants

Please take notice that, the plaintiffs have filed OS. No. 301 OF 2026 for declaring them as legal heirs of Late P. Sudershan, Salarjung Kancha Village, Parvathapur Gram Panchayat, Medipally Mandal, Medchal-Malkajgiri District And the matter is posted to 15-7-2026.

SCHEDULE OF THE PROPERTY
All the open piece land marked Plot bearing No.E/62, Admeasuring 360.00 Sq.Yards, equivalent to 300.96 Sq.Mtrs, in survey Nos. 12, 13, 19, 20 and 21 Situated at Salarjung Kancha Village, Parvathapur Gram Panchayat, Ghatkesar Mandal, Ranga Reddy District presently Medipally Mandal, Medchal-Malkajgiri District and bounded by:
NORTH : Plot No.E/63,
SOUTH : Plot No.E/61,
EAST : Plot No.E/111,
WEST : 30' wide Road
Therefore if anybody having any claim or objection may attend before the Honorable I Addl. Junior Civil Judge, Medchal-Malkajgiri Dist, At.Medipally, on 15-7-2026 at 10-30 A.M either personally or through advocate, failing which the matter may be decided in your absence.

K. Suresh,
K. Srinivas Rao
Advocates
Office No.1-102/3,Mallikarjuna nagar, Peerzadiguda, Medipally, Hyd-500092
Cell: 9515949658.
(counsel for the Plaintiffs)

కెటిఆర్ సభకు వెళ్లిన ఎర్రబెల్లి సతీష్ రావు

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 23, ప్రభాతవార్త

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ఎమ్మెల్యే మాధవరం కృష్ణ రావు ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన పార్టీ సభ్యత్వ నమోదు సభకు ఎర్రబెల్లి సతీష్ రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. స్థానికంగా నిర్వహించిన సభకు పెద్ద ఎత్తున ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువనా యకులతో కలిసి ఎర్రబెల్లి సతీష్ రావు భారీ ర్యాలీగా వెళ్లి పాల్గొన్నారు.

సభకు బయలుదేరుతున్న దృశ్యం

తెలంగాణ ప్రభుత్వం
మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, నాచారం సర్కిల్-8, MMC
'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
నిట్ నం. 8/MMC/NC-8/EE/2026-27 తేది: 23.06.2026
నిట్ నం. 8/MMC/NC-8/EE/2026-27, తేది: 22.06.2026, పని యొక్క పేరు: MMC నాచారం సర్కిల్ 8లో 1 నం. అభివృద్ధి పని. మొత్తం లక్షల్లో : 17.50 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేది, సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 23.06.2026, మ.3.00గం. బిడ్ దాఖలు ముగింపు తేది : 25.06.2026 మ.3.00గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేది సమయం : 25.06.2026 మ.3.00గం. డ్రైస్ బిడ్ తెరచు తేది : 25.06.2026 మ.3.00గం. అధికారి పేరు, చిరునామా, ఫోన్ నెం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాచారం సర్కిల్-8, MMC, ECIL, హైదరాబాద్, 8790374055. తదుపరి వివరాలు https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. మరియు కోటేషన్ వివరాలను GHMC వెబ్‌సైట్ https://ghmc.gov.in నుండి పొందవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

వైదేహినగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం. జూన్.23.ప్రభాతవార్త.

వైదేహి నగర్ కాలనీలో మంచినీళ్లు సరైన సమయానికి విడుదల కాక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేయడంతో స్పందించిన బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు.జలమండలి మేనేజర్ భాను ప్రకాష్ రెడ్డితో చర్చించి, ప్రజలకు సమయానికి మంచినీళ్లు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులను తిదీ రామ్ చంద్రయ్య కలిసి కరెంటు వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి, భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పి దామోదర్ రెడ్డి, సెక్రెటరీ జంగారెడ్డి,నరసింహారెడ్డి, రామచందర్ గౌడ్, కోశాధికారి శివరాం ప్రసాద్, రామ్మోహన్ చౌదరి, జోగి రెడ్డి, రమణమూర్తి,తిరుపతయ్య మరియు తదితరులు ఉన్నారు.

తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం : రాజేశ్వరరావు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాటేపల్లి రాజేశ్వరరావు

మలక్ పేట, జూన్ 23,ప్రభాతవార్త: తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని ఎటువంటి అవకతవకలకు పాల్పడలేదని కాటేపల్లి రాజేశ్వర రావు పేర్కొన్నారు. ముసారాంబాగ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అవన్నీ నిరాధారమని స్పష్టం చేశారు. కుల పరంగా, సంఘ పరంగా చేసిన కార్యక్రమాలలో ఎలాంటి ఆర్థిక లావాదేవీలలో అవకతవకలకు పాల్పడలేదని వివరించారు. పూర్తి ఆధారాలతో ఎవరైనా ముసారాంబాగ్ లని తన నివాసానికి వస్తే వెంటనే వారికి నగదు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. తనపై అసత్య ఆరోపణ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు నేరేడ్‌మెట్ పరిధిలో విద్యుత్ సరఫరా అంతరాయం

నేరేడ్‌మెట్,జూన్ 23 ప్రభాతవార్త :

చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ నిర్వహణ పనుల నేపథ్యంలో నేరేడ్మెట్ విద్యుత్ విభాగం పరిధిలో బుధవారం (జూన్ 24) పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సహాయ ఇంజనీర్ జి. లత తెలిపారు.ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వాజ్‌పేయి నగర్ ఉపకేంద్ర పరిధిలోని దీన్‌దయాళ్ నగర్ ఫీడర్‌కు అనుసంధానమైన హిల్ కాలనీ, దీన్‌దయాళ్ నగర్, కాకతీయ నగర్, గీతా నగర్, ఆఫీసర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాయుపురి ఉపకేంద్రంలోని జేకే కాలనీ ఫీడర్ పరిధిలోని జేకే కాలనీ, కాకతీయ నగర్, వినోబా నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది.విద్యుత్ నిర్వహణ పనులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత ప్రాంతాల ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వైద్య శిబిరంలో పాల్గొన్న లింగాల రాహుల్‌గౌడ్, దయానంద్‌గుప్తా, లింగాల నాగేశ్వరరావు

ఎల్.బి.నగర్, జూన్ 23 ప్రభాతవార్త:

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్ పేర్కొన్నారు. కొత్తపేట గ్రామంలో మంగళవారం లింగాల రాహుల్ గౌడ్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో వందలాది మందికి దంతా, కంటి, ఈసీజీ, పలు రకాల రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణ దృష్టిలో పెట్టుకొని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో ప్రజలు పలు ఆరోగ్య పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిరంతరం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తా, ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లింగాల నాగేశ్వరరావు, చైతన్యపురి డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్, కొత్తపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల కిషోర్‌గౌడ్, మల్లేశం, రమణ, తోట శ్రీనివాస్‌యాదవ్, రవికేశవనాయుడు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శరవేగంగా ఉప్పల్ కారిడార్ పనులు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్ రాజిరెడ్డి కారిడార్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, జూన్ 23 ప్రభాతవార్త : ఉప్పల్ బండారి రాజిరెడ్డి కారిడార్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ చౌరస్తాలో జరుగుతున్న కారిడార్ పనులతోపాటు, నల్ల చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. నల్లచెరువు అభివృద్ధి ద్వారా పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. బండారి రాజిరెడ్డి ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించి ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ఉప్పల్ నల్లచెరువు ప్రాంతంలో బస్ టెర్మినల్ ఏర్పాటు చేసే ఆలోచన ఉందని, ఈ విషయాన్ని ఇప్పటికే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అలాగే ప్రభుత్వ పెద్దల దృష్టికి కూడా ఈ ప్రతిపాదనను తీసుకెళ్లి, బస్ టెర్మినల్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా నల్లచెరువు ప్రాంతంలో ప్రతిపాదిత స్థలాన్ని ఆయన పరిశీలించారు. బస్ టెర్మినల్ ఏర్పాటుతో ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలకు కూడా కొంతవరకు పరిష్కారం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు, ట్రాఫిక్ సిఐ నాగరాజు పాల్గొన్నారు.

వినోబా నగర్‌లో వైభవంగా కళ్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

నేరేడ్ మెట్,జూన్ 23 ,ప్రభాతవార్త : వినోబా నగర్‌లోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం శుద్ధ నవమి సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పలు విశిష్ట ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.ఉదయం 7 గంటలకు అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, ద్వారతోరణం, చతుస్థానార్చన, మూర్తి కుంభారాధన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం ఉదయం 7.30 గంటలకు అగ్ని ప్రతిష్ఠ నిర్వహించి మూల మంత్ర హవనాన్ని నిర్వహించారు. సకల కార్యసిద్ధి, సంతాన ప్రాప్తి, వివాహ ప్రాప్తి కోసం ప్రత్యేక గరుడ హవనాన్ని వేద పండితులు భక్తుల గోత్రనామాలతో నిర్వహించారు.ఉదయం 9.30 గంటలకు ఆలయ క్షేమాభివృద్ధి, లోకకల్యాణం కోసం సుదర్శన, నారసింహ హవనాలు ఘనంగా జరిగాయి. అనంతరం ఉదయం 11 గంటలకు నిత్య పూర్ణాహుతి నిర్వహించి, 11.30 గంటలకు ధ్వజారోహణం, బలిహరణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు గరుడ ప్రసాదం, తీర్థప్రసాదాల పంపిణీ చేపట్టి తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు.సాయంత్రం 4 గంటల నుంచి విష్ణు సహస్ర

నామ పారాయణం, చతుస్థానార్చన, మూర్తి కుంభారాధన, మూలమంత్ర హవనాలతో పాటు సకల ఐశ్వర్య ప్రాప్తి కోసం శ్రీ మహాలక్ష్మీ హవనాన్ని ఘనంగా నిర్వహించారు. భేరీ తాడనం, దేవతా ఆహ్వానం, బలిహరణ అనంతరం శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఎదురుకోళ్ళు ఉత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించబడగా, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు, అర్చక బృందం విస్తృత ఏర్పాట్లు చేశారు.

జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత ముఖ్యం : డిసిపి సురేష్ కుమార్

ఉప్పల్, జూన్ 23 ప్రభాతవార్త : సమాజాన్ని చైతన్య పరచడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని మల్కాజిగిరి కమిషనరేట్ ఉప్పల్ జోన్ డిసిపి కే. సురేష్ కుమార్ పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులతో పాటి జర్నలిస్టులు కూడా తమ వంతు బాధ్యతను నెరవేరుస్తున్నారని అన్నారు. రోడ్డు భద్రతపై నియమ నిబంధనలను జర్నలిస్టులు ఆచరిస్తూనే ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు. మంగళవారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల సౌజన్యంతో నిర్వహించిన జర్నలిస్టులకు హెల్మెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసానందానంగా ఉండే జర్నలిస్టులు తమ ఆరోగ్య భద్రతపై కూడా దృష్టి సాధించాలన్నారు. వార్తా సేకరణతో పాటు సామాజిక సామాజిక అంశాలు, శాంతి భద్రతలు, నేరాల నియంత్రణలో జర్నలిస్టులు చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. జర్నలిస్టులు సమాజానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. అంతకుముందు లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయంతిరెడ్డి మాట్లాడుతూ సమాచార సేకరణతో పాటు సామాజిక సమస్యలపై జర్నలిస్టులు చేస్తున్న పోరాటాన్ని అభినందించారు. టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం ఆరోగ్య భద్రతకు ఉప్పల్ ప్రెస్ క్లబ్ చేస్తున్న కృషిని అభినందించారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమంతో పాటు నిరంతరం సామాజిక చైతన్య, సంక్షేమ

జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న ఉప్పల్ జోన్ డిసిపి కె.సురేష్‌కుమార్, అడిషనల్ డిసిపి వెంకటరమణ, బ్రదర్ జాన్ క్లరికల్, బ్రదర్ అరుణ్ ప్రకాష్ తదితరులు

కార్యక్రమాలను చేపట్టడంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న తోటి జర్నలిస్టులకు అండగా నిలుస్తామని, ఏడాది క్రితం ఆకస్మికంగా మృతి చెందిన జర్నలిస్టు మాదిరాజు సురేష్ కుటుంబాన్ని ఆదుకున్న విషయం ప్రతి ఒక్కరికి తెలుసునన్నారు. ఈ సందర్భంగా 30 మంది జర్నలిస్టులకు హెల్మెట్లను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల డైరెక్టర్ బ్రదర్ జాన్ కలరికల్, కళాశాల కరస్పాండెంట్ బ్రదర్ అరుణ్ ప్రకాష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయంతి రెడ్డి, ఉప్పల్ జోన్ అడిషనల్ డిసిపి వెంకట్ రమణ, ఉప్పల్ ఏసిపి వై వెంకట్ రెడ్డి, ఉప్పల్ ఇన్స్పెక్టర్ వై.రామలింగారెడ్డి, ఎస్సైలు మధుసూదన్, వినయ్, సమత, ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వి.తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.శివాజీ, టీయూడబ్ల్యూజే నియోజకవర్గం అధ్యక్షుడు పి. మహేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే జిల్లా హెల్త్ కమిటి కన్వీనర్ కె.చంద్రమౌళి, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. .

28న తెలంగాణకు బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

: పార్టీ బలోపేతంపై బూత్ స్థాయి సమావేశం

నాచారం, జూన్ 23 ప్రభాతవార్త :

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఈ నెల 28న తెలంగాణ రాష్ట్ర పర్యటనకు రానున్నారని బీజేపీ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల నర్సింగ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం తదితర అంశాలపై బూత్ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల నర్సింగ్‌రావు తెలిపారు.ఈ మేరకు నాచారం లోని ఆయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లెల నర్సింగ్ రావు మాట్లాడుతూ బూత్ స్థాయి అధ్యక్షులు, బీఎల్ఏ2లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ పదాధికారులు, జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు ఈ సమావేశంలో పాల్గొంటారని వెల్లడించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్ఠం చేయడం, రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలు, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించడం, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాలపై జాతీయ అధ్యక్షుడు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.అదేవిధంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, దేశ ప్రగతి కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై కూడా సమావేశంలో సమీక్ష జరగనున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపడంతో పాటు, భవిష్యత్ రాజకీయ కార్యాచరణకు మార్గదర్శకంగా నిలుస్తుందని మల్లెల నర్సింగ్‌రావు అన్నారు.ఈ పత్రికా సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, నాయకులు బండారు వెంకట్రావు, దేవసాని బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మల్లెల నర్సింగ్ రావు చిత్రంలో ఇతర నేతలు

ఎస్ఎన్‌డిపి నాలాల కోసం రోడ్లను తవ్వారు.. పునర్నిర్మించడం మరిచారు

-శంషాబాద్ జడ్‌సి దృష్టికి సమస్యలు తెచ్చిన అల్మాస్‌గూడ కాలనీ సంక్షేమ సంఘాలు

సరూర్‌నగర్, జూన్ 23 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్ కిందకు వచ్చే బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని నాదర్‌గుల్ డివిజన్‌కు సంబంధించిన అల్మాస్‌గూడ కాలనీలు మధురాపురి, న్యూ మధురాపురి, బోయపల్లి ఎన్‌క్లేవ్, సిఎంఆర్ (చప్పిడి యాదగిరిరెడ్డినగర్) తదితర కాలనీల్లో వరద ముంపు సమస్యలను తీర్చడానికి ఉద్దేశించిన ఎస్ఎన్‌డిపి నాలా పనుల కోసం తవ్విన రోడ్లను నిర్లక్ష్యంగా వదిలివేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆయా కాలనీల సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమ ప్రాంతాల్లో తీవ్ర అసౌకర్యంగా మారిన రోడ్లను పునర్నిర్మించాలని వారు జోనల్ కమీషనర్ చంద్రకళను కోరారు. మంగళవారం డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ జడ్‌సి కార్యాలయంలో చంద్రకళను కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీల్లో ట్రంక్ లైన్ నిర్మాణం తర్వాత తవ్విన రోడ్లను వదిలివేయడం వల్ల స్థానిక రోడ్లు అధ్వాన్నంగా మారాయనీ ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో బురదమయంగా మారి నరకాన్ని తలపిస్తున్నాయని జోనల్ కమీషనర్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో అవసరమైన నిధులు మంజూరు చేసి రోడ్లు మరమ్మతులు, నిర్మాణాలు చేయాలని వారు కోరారు. నవారు మల్లారెడ్డి, కాలనీ సంఘం నాయకులు చేసిన విజ్ఞప్తికి స్పందించిన జడ్‌సి చంద్రకళ బడంగ్‌పేట్ సర్కిల్ అధికారులచే రోడ్ల నిర్మాణానికి ఎస్టిమేట్లు వేయించి త్వరలో పనులు జరిగేలా చూస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు నవీన్‌రెడ్డి, ఖైసర్, బసవరాజ్, సంతోష్‌చారి, యాదగిరిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళకు వినతి పత్రం సమర్పిస్తున్న అల్మాస్‌గూడ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు

ముస్లిం ప్రజల సమస్యలపై స్పందించిన బిజెపి నేత

-ప్రైడ్ కాలనీలో ఔట్‌లెట్ సమస్యను తీర్చాలని డిసికి వినతి

సరూర్‌నగర్, జూన్ 23 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని 61వ డివిజన్ కిందకు వచ్చే ప్రైడ్ కాలనీలో అత్యధికంగా నివసిస్తున్న ముస్లిం సామాజిక వర్గ ప్రజలను కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయే తప్ప వారి సమస్యలను పట్టించుకోవడం లేదని డివిజన్ బిజెపి ఇంఛార్జి, సర్కిల్ బిజెపి సీనియర్ నాయకుడు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక ప్రైడ్ కాలనీలో డ్రైనేజీ, ఔట్‌లెట్ సమస్యలపై స్పందించిన ఆయన కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్, ఉపాధ్యక్షుడు మహ్మద్ షుకూర్, కార్యవర్గ సభ్యులు షహబాజ్, షేక్ ఫారూఖ్, బిలాల్ హైదరాబాది, ఇలియాస్, ఖాదిర్, సయ్యద్ అమీన్ తదితరులతో బడంగ్‌పేట్ సర్కిల్ డిసి సమ్మయ్యను కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. కాలనీలో డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్ళడానికి సరైన ఔట్‌లెట్ లేకపోవడంతో రోడ్లపై, ఇళ్ళల్లోకి మురికి నీరు చేరడం వల్ల స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని డిసికి వివరించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల వారు గానీ, గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు గానీ ప్రైడ్ కాలనీ సమస్యలను పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ఇక్కడి ప్రజలకు కనీస సదుపాయాలను కల్పించడం విఫలమయ్యారని ఆయన అన్నారు. స్థానిక మైనారిటీ ప్రజల సమస్యలను తీర్చడానికి బిజెపి తరపున కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో తమ వినతికి స్పందించి ప్రైడ్ కాలనీలో డ్రైనేజీ ఔట్‌లెట్ వ్యవస్థను ఏర్పాటు చేసి స్థానికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని శ్రీనివాస్‌రెడ్డి డిసిని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బంద్యాల శంకర్‌రెడ్డి, ఈశ్వర్, ఎన్ను యాదిరెడ్డి, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రైడ్ కాలనీ మైనారిటీలతో కలిసి బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న డివిజన్ బిజెపి ఇంఛార్జి పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

బీరప్పగడ్డ డివిజన్ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి

చిలుకానగర్ డివిజన్ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బన్నాల ప్రవీణ్ తదితరులు

ఉప్పల్, జూన్ 23 ప్రభాతవార్త : బీరప్పగడ్డ డివిజన్ లోని పలు సమస్యలు పరిష్కరించాలని కోరతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరికి కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం అంబేద్కర్ నగర్ కమ్యూనిటీహాల్ లో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలకు తరలించాలని సూచించారు. అంబేద్కర్ నగర్ కాలనీలో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో గత అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని,. అయితే స్థానిక బస్తీ ప్రజల దీర్ఘకాలిక విజ్ఞప్తి మేరకు ఆ ప్రదేశంలో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. త్వరలో కమ్యూనిటిహాల్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రస్తుతం అక్కడ చదువుతున్న విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీనిపై అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్వాహనోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న పున్న నిర్మలగణేష్‌నేత

ఎల్.బి.నగర్, జూన్ 23 ప్రభాతవార్త:

హనుమద్వాహనోత్సవం కార్యక్రమాన్ని భక్తుల కోలాహలం మధ్య ఘనంగా నిర్వహించారు.శ్రీరామకృష్ణపురం డివిజన్ సౌభాగ్యపురంకాలనీలో శ్రీఅలివేలుమంగ పద్మావతి గోదాసమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో పంచదశ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడవ రోజు హనుమద్వాహనోత్సవం నిర్వహించారు. శ్రీరామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పున్న నిర్మలగణేష్‌నేత, డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత దంపతులు మంగళవారం రథోత్సవంలో పాల్గొని,స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సుప్రభాత సేవ, నిత్య పూర్ణాహుతి, శేష వాహనోత్సవం, శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపంలో ఎదుర్కోలు తదితర కార్యక్రమాలు వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావ్, జెల్ల జగన్నాథం, పగడాల ఎల్లన్న, మల్లేష్‌యాదవ్, లింగారెడ్డి, సుధాకర్‌గుప్తా, పురుషోత్తంగుప్తా, అచ్చయ్య, దేవాలయం కమిటీ మరియు సౌభాగ్యపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరెడ్డి, ఎంఆర్‌కే.మూర్తి, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, శ్రీకాంత్,అనిల్ చంద్రకాంత్ కాలనీవాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేద ప్రజలకు న్యాయం

ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి...

కుషాయిగూడ ,జూన్ 23,ప్రభాతవార్త

పేద ప్రజలకు న్యాయం చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలంగాణ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్కిత్రాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ లక్ష్మీ గార్డెన్స్ లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వమే మూలమని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీ దయానంద్ కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి ఉప్పల్ ఇంచార్జీలు వజ్రేష్ యాదవ్ పరమేశ్వర్ రెడ్డి ,రవీందర్ సాగర్ డిప్యూటీ కమిషనర్ కాప్రా, దీప్తి కమిషనర్ నాచారం శైలజ దీప్తి కమిషనర్ ఉప్పల్ జక్కయ్య సుల్తానా డిప్యూటీ కమిషనర్ మోలాలి తదితరులు పాల్గొన్నారు.

మాధవనగర్ కాలనీలోని సమస్యలు పరిష్కరించండి